క్లుప్తంగా

వైభవంగా విజయ గణపతి బ్రహ్మోత్సవాలు



పూజలు చేస్తున్న అర్చకులు

పాత గుంటూరు: ఎస్వీఎన్ కాలనీలోని శ్రీ పద్మావతీ గోదాసమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో విజయ గణపతి స్వామి అష్టాదశ(18) వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం ప్రాతఃస్నపనం, నిత్యహోమం, లక్ష్మీ సుదర్శన హోమం, పారమాత్మిక మహాశాంతి హోమం, బలిహరణ, అవభృత స్నానం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం అనంతరం తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాన్నం అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం ద్వాదశ ప్రదక్షణలు, ఊంజల్ సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

విద్యార్థులను పరామర్శించిన డైరెక్టర్ ప్రగతి



బాలికను పరామర్శిస్తున్న ప్రగతి

గుంటూరు మెడికల్ : అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని గురుకుల పాఠశాల బాలికలను మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ కె.బి.ఎస్.ప్రగతి పరామర్శించారు. బాలికల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రి వైద్యులకు సూచించారు.

డాక్టర్ విజయగౌరి దంపతులకు సన్మానం



డాక్టర్ విజయగౌరి దంపతులను సన్మానిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

గుంటూరుమెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా విధులు నిర్వహిస్తూ మంగళవారం పదవీ విరమణ చేసిన డాక్టర్ స్వర్ణ విజయగౌరిని పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది గుంటూరులోని ఆర్డీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆర్డీగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఉమ్మడి గుంటూరు జిల్లా, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది, ఏపీ ఎన్జీఓ నేతలు, నర్సింగ్ యూనియన్ నేతలు, ఆర్డీ కార్యాలయ అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలామృతంపై అవగాహన కల్పించాలి

నగరంపాలెం: గుంటూరు (యు) 13 ప్రాజెక్టులోని 169 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏడు నెలల నుంచి మూడేళ్ల వయసు చిన్నారులకు ప్రతి నెల బాలామృతంను అందిస్తున్నట్లు అంగన్‌వాడీ టీచర్ డి.వేదవతి తెలిపారు. ఇందిరా ప్రియదర్శిని కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం బాలామృతంపై అవగాహన సదస్సు నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజు వంద గ్రాముల చొప్పున చిన్నారులకు తినిపించాలని అన్నారు. బాలామృతం సంచిపై ఉన్న పోషక విలువలను కూడా ప్రతి ఒక్క లబ్ధిదారులకు వివరించారు. అదే విధంగా ఎలా తినిపించాలనేది అవగాహన కల్పించారని పేర్కొన్నారు. లబ్ధిదారులు బాలామృతంను సద్వినియోగం చేసుకోవాలని, వృథా చేయవద్దని కోరారు. ఎప్పటికప్పుడు వాటిని పిల్లలకు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో రక్తదాన శిబిరం

పాత గుంటూరు: 34వ రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మంగళవారం గుంటూరు ఆర్టీసీ బస్టాండ్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నెల్లూరు జోన్ ఈడీ ఆదం సాహెబ్ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. జీజీహెచ్ డాక్టర్ సురేష్ నిర్వహించిన కార్యక్రమంలో 32 మంది, డ్రైవర్లు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ఈడీ సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో డిపిటిఓ జి. విజయగీత, సియంఇ నర్రా శ్రీనివాసరావు, డిపో మేనేజర్లు రామకృష్ణారావు, అబ్దుల్ సలామ్, వైద్యాధికారి విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఇరువురు అరెస్ట్

పట్నంబజారు: కోడిపందేలు ఆడుతున్న వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. నగరంపాలెం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కృష్ణబాబు కాలనీ పరిసర ప్రాంతాల్లో కొంత మంది వ్యక్తులు కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం అందుకున్న పోలీసులు మంగళవారం దాడిచేశారు. ఏడుగురు వ్యక్తుల్లో ఐదుగురు పరారయ్యారు. ఇరువురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఓ కోడిపుంజును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

హోర్డింగ్ ఏజెన్సీల నుంచి ఫీజులు వసూలు చేయాలి

కమిషనర్ కీర్తి చేకూరి



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో బకాయి ఉన్న అడ్వర్టైజింగ్ బోర్డులు, హోర్డింగ్ ఏజెన్సీల నుంచి మీడియా డివైజ్ డిస్ప్లే ఫీజులు వెంటనే వసూళ్లకు కార్యాచరణ సిద్ధం చేయాలని, ఏసీపీ, టీపీఎస్‌ల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాల్లో పట్టణ ప్రణాళిక అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మీడియా డివైజ్ ఫీజుల వసూళ్లలో పురోగతి లేదని, ప్రత్యేక బృందాల ద్వారా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని, ఫీజులు చెల్లించని వారి బోర్డులను తొలగించాలని స్పష్టం చేశారు. టీపీఎస్‌లు, ఏసీపీల వారీగా బకాయిల వసూళ్లకు లక్ష్యాన్ని నిర్దేశించాలన్నారు. అదే విధంగా బోర్డులకు క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేయాలని, ప్రతి బోర్డ్‌కు జియోట్యాగ్‌లను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. నగరంలో ఉన్న అనధికార లే అవుట్స్‌ని ఇన్ ప్రిన్సిపుల్ లే అవుట్స్‌గా అప్‌లైచేయించాలని, వాటికి అనుమతులు వస్తేనే నూతన భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడానికి వీలు కలుగుతుందన్నారు. రోడ్డు విస్తరణ పనులను సమీక్షించి ప్రధాన రహదార్లు విస్తరణ పనులు దాదాపు పూర్తయ్యాయని, ఇంకా ఏమైనా పెండింగ్ ఉంటే 2 రోజుల్లో పూర్తి చేయాలన్నారు. విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల నిర్మాణంపై ఇంజినీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. నూతనంగా విస్తరణ పనులు చేపట్టే ప్రాంతాల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. విభాగ కోర్ట్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కౌంటర్స్, ప్యార వైజ్ రిమార్క్స్ పక్కాగా నిర్దేశిత గడువులోగా కోర్ట్‌కు పంపాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల గోడలు, పబ్లిక్ ప్రాంతాల్లో వాల్ పోస్టర్స్ అంటించే వారిపై పోలీసు కేసు నమోదు చేయడంతో పాటు, భారీ మొత్తంలో అపరాధ రుసుం విధించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డెప్యూటీ సిటి ప్లానర్ కోటయ్య, ఏసీపీలు కాలేష, బాబురావు, అశోక్ కుమార్, అజయ్ కుమార్, సూపరిండెంట్ ప్రసాద్, సర్వేయర్ సునీల్ కుమార్, టీపీఎస్‌లు పాల్గొన్నారు.

సైన్స్ ఎక్స్‌పోకు విశేష స్పందన



ప్రాజెక్టులను తిలకిస్తున్న విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సైన్స్ సిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పోకు మంగళవారం విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. నగరంలోని వివిధ విద్యాసంస్థల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ప్రదర్శన తిలకించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పీఎం ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు చూసేందుకు వీలుగా తగిన సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. ప్రదర్శనలో వేదగణితం ద్వారా క్యూబ్లు, రూట్లు తదితరాలను సులభంగా కనుక్కోవడం, నేచురల్ సైన్స్ విభాగంలో భూమి పరిరక్షణ, ఫుడ్ టెక్నాలజీ, రసాయన శాస్త్రవిభాగాల నుంచి ఆకర్షణీయ వర్కింగ్ మోడల్స్, సాంఘిక శాస్త్ర విభాగం నుంచి అమరావతి స్థూపం విశేషాలు లాంటివన్నీ వర్కింగ్ మోడల్స్ రూపంలో 300 వరకుకు ఉన్నాయని చెప్పారు. ప్రత్యేకంగా మా-స్కానింగ్ సెంటర్ ఆధ్వర్యంలో సంపూర్ణ శరీర స్కానింగ్ విధాన్ని చూపించారు. నూమిస్ మాటిక్ ఫిలాటలీ అసోసియేషన్ ద్వారా అరుదైన స్టాంపులు, నాణేల ప్రదర్శన, టీఎస్వరప్రసాద్ ప్రకృతి అందాల ఛాయాచిత్ర ప్రదర్శన, గుడివాడ సిస్టర్స్ నీడిల్ ఆర్ట్, కోన్ పెయింటింగ్ ఏర్పాటు చేసారు. వీటన్నిటినీ సందర్శకులు ఎంతో ఆసక్తిగా చూస్తున్నారు. ప్రదర్శన బుధవారం సాయంత్రం 5.00 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రవేశం ఉచితమని ప్రిన్సిపల్ పీఎంప్రసాద్ చెప్పారు.

లాల్ జాన్ బాషా పార్క్ ప్రారంభం



పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా, కమిషనర్ కీర్తి చేకూరి, డెప్యూటీ మేయర్ సజీలా

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని ఆరోగ్య నగరంగా మార్చుకోవడానికి పార్క్‌ల అభివృద్ధి కీలకమని అందుకు నగరపాలక సంస ప్రత్యేక కృషి చేస్తోందని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం పొన్నూరు రోడ్డులోని లాల్ జాన్ భాషా పార్క్‌ను తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా, డెప్యూటీ మేయర్ షేక్ సజిలాతో కలిసి కమిషనర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో కాలనీల్లో స్థానికంగా ఉన్న పార్క్‌ల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. గాంధీ పార్క్ పనులు కూడా వేగంగా జరిగేలా ఈస్థాయి అధికారిని ప్రత్యేక పర్యవేక్షణ బాధ్యతలు కేటాయించామన్నారు. ఆర్టీసీ కాలనీ పార్క్‌ని ఇటీవలే ప్రారంభించడం జరిగిందన్నారు. త్వరలో తూర్పు నియోజకవర్గంలో నగరపాలక సంస్థ తరుపున స్విమ్మింగ్ పూల్ కూడా నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. పార్క్‌లను పిల్లకు ఆడుకోవడానికి, వాకింగ్ కోసం, పర్యావరణ సమతుల్యత కోసం అభివృద్ధి చేస్తున్నామని, నగర ప్రజలు పార్క్‌ల్లో వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ వేయకుండా స్వచ్ఛంగా ఉంచేందుకు సహకరించాలని, పార్క్‌ల శుభ్రత సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. లాల్ జాన్ భాషా పార్క్‌ని రూ.37.67 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, పిల్లల ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పచ్చదనం కోసం లాన్, మొక్కలు పెంపకం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానికంగా పార్క్‌లు ఏర్పాటు చేస్తే సదరు ప్రాంతంలో ప్రజారోగ్య రక్షణకు కృషి చేసినట్లేనన్నారు. పార్క్‌లు విరివిగా ఉండడం వల్ల గాలిలో ఆక్సిజన్ శాతం పెరుగుతుందన్నారు. లాల్ జాన్ భాష పార్క్‌ను ఎంతో అందంగా అభివృద్ధి చేశారన్నారు. నగరంలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పార్క్‌ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. అదే విధంగా నగరంలో విరివిగా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. లాల్ జాన్ బాషా పార్క్ అభివృద్ధి ద్వారా చుట్టు పక్కల ముస్లిం మైనార్టీ మహిళలకు వాకింగ్‌కు అవకాశం కల్గుతుందన్నారు. తొలుత పార్క్ ప్రధాన ద్వారాన్ని, ఓపెన్ జిమ్ ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఈ కోటేశ్వరరావు, ఏడీహెచ్ రామారావు, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, కళ్యాణరావు, ఏఈ రాంబాబు, కార్పొరేటర్లు, సచివాలయం కార్యదర్శులు పాల్గొన్నారు.

వృద్ధులకు తోడుగా జాయ్ మేకర్స్ చారిటబుల్ ట్రస్టు

గుంటూరు మెడికల్ : కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ వృద్ధులను చూసే సమయం లేక ఆశ్రమంలో వదిలి వెళ్లే వారికి మేమున్నామంటూ జాయ్ మేకర్స్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు వద్దులకు అండగా నిలిచారు. గుంటూరు నగరంలోని స్థానిక ఏటుకూరు వద్ద ఉన్న మమ్మీ డాడీ ఆశ్రమంలోని మంగళవారం వృద్ధులకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జాయ్ మేకర్స్ ట్రస్ట్ డైరెక్టర్స్ నూతలపాటి మణిసుహిత్, తలతోటి మనోజ్‌లు మాట్లాడుతూ అందరూ ఉన్న వద్దులతో సమయాన్ని గడిపే వారు లేకపోవడం మనసుకు బాధ కలిగించిందన్నారు. అలాంటి వారి కోసం జాయ్ మేకర్స్ ట్రస్ట్‌ను స్థాపించి వారికి తోడుగా నిలవడం ఎంతగానో సంతోషాన్ని ఇచ్చిందని అన్నారు. ఒక వైపు ఉద్యోగం చేసుకుంటూ ఆశ్రమంలో వుండే వారికి సహాయ పడుతూ ఉంటామని తెలిపారు. ఆపదలో ఉన్న వారి కోసం మేమున్నామంటూ వారికి ధైర్యం చెప్పి అండగా నిలుస్తామన్నారు. కార్యక్రమంలో బాబు, ప్రవీణ్ ప్రకాష్, కార్తిక్, ప్రమోద్, ధనరాజు, దాసు మోజెస్, అనిల్, కిరణ్, మాణిక్యరాజు తదితరులు పాల్గొన్నారు.

విజేత సేవా సమితి సేవలు అభినందనీయం

నెహ్రూనగర్: శ్రీ విజేత సేవా సమితి సేవలు అభినందనీయమని వీఎస్ఆర్ హై స్కూల్ డైరెక్టర్ వంగా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఏటుకూరు రోడ్డులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీ విజేత సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు, అన్నదానం, అనాధలకు విద్యభ్యాసం, కరోనా సమయంలో అన్నదానం చేసినందుకుగాను సేవా సమితి అధ్యక్షులు చెరుకూరి శ్రీహరికి విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వారు స్వామి వివేకానంద ఇండియన్ ఐకాన్ అవార్డు అందజేసినందుకు ప్రత్యేకంగా అభినందనీయమన్నారు. భవిష్యత్తులో పేద ప్రజలకు మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

జొన్నలగడ్డలో క్రాఫ్ బుకింగ్ వెరిఫికేషన్



రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు

గుంటూరు రూరల్: మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం ఈ క్రాఫ్ బుకింగ్ డేటా సూపర్ చెక్ వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నా రు. ఈ సందర్భంగా రైతుల ఈ క్రాఫ్ బుకింగ్‌ను వెరిఫై చేశారు. వివిధ పంటలలో రైతులకు సమగ్ర యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు వివరించారు. క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి పంటనమోదు, ఈకెవైసీలను త్వరగా పూర్తి చేయాలని సంభందిత అధికారులను ఆదేశించారు. రైతులు తమ పంటలను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుంటే కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.సుబ్రమణ్యం, వీఏఏ ఆనందబాబు, వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాసరావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కవికోకిల జాషువా పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మాణిక్యవరప్రసాద్

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికగా కళాస్రవంతి ఆధ్వర్యంలో సాహితీ కళారత్న డాక్టర్. దేవరపల్లి ప్రభుదాస్ రచించిన కవికోకిల జాషువా పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిధిగా శాసన మండలి సభ్యులు డొక్కా మాణిక్య వరప్రసాద్, ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, డాక్టర్. ఐనాల మల్లేశ్వరరావు పాల్గొని జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. సభకు కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. నటశేఖర తుర్లపాటి రాధాకృష్ణమూర్తి, సారస్వత కళానిధి డాక్టర్ వి. నాగ రాజ్యలక్ష్మీ పుస్తక సమీక్షలుగా పాల్గొన్నారు. డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ జాషువా రచనలు చిరస్మరణీయమని అన్నారు. అనంతరం సత్య హరిశ్చంద్ర నాటకంలోని అడవి, వారణాసి ఘట్టాలను ప్రదర్శించగా ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. హరిశ్చంద్రుడుగా పల్నాటి సుబ్బారావు, డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, చంద్రమతిగా బండారు పద్మ, తదితరులు నటించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: బ్రాడీపేట రెండోలైనులోని శ్రీ సిద్ధేశ్వరీ పీఠ పాలిత ఓంకారక్షేత్రంలో శ్రీ సీతారామాంజనేయ నగర సంకీర్తనా సంఘం ఆధ్వర్యంలో కార్యదర్శి నంబూరి వేంకటనారాయణమూర్తి పర్యవేక్షణలో 89వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాలు, 93 వ సంఘ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా మంగళవారం శ్రీ ఆంజనేయస్వామికి నాగవల్లీ దళార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు బుజ్జి బృందం నిర్వహణలో శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. దంపతుల ముత్యాల తలంబ్రాలు, మహా హారతి, మంత్ర పుష్పం, అర్చకుల ఆశీర్వాదం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. టీ. బాల సుబ్బారావు భక్తి సంగీతం, మంచికంటి వెంకట సత్యవతి శ్రీ మద్రామాయణ ప్రవచనంలో ఆంజనేయుడు సీతాన్వేషణ, సీతామాతతో సంభాషణ, లంకలో భీభత్సం చేసిన విధానాన్ని వివరించారు.

తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని వినతి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ముస్తఫా

నెహ్రూనగర్: గుంటూరు తూర్పు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా నగర కమిషనర్ కీర్తి చేకూరిని కోరారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి పలు సమస్యలను పరిష్కారించాలని వినతి పత్రం అందజేశారు. రానున్న మార్చి నెలలో ముస్లిం శ్మశాన వాటికలకు అవసరమైన వసతులు కల్పించాలని, పెద్దల పండుగ పురస్కరించుకుని శ్మశాన వాటికలను అభివృద్ధి చేయాలన్నారు. నియోజకవర్గం నుంచి బయటకు వెళ్లే ప్రధాన రహదారులు ఆర్అండ్‌బీ శాఖ వారివి కావడంతో వారితో చర్చించి రహదారులను అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో పలు ప్రధాన రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. మూడు వంతెనల నుంచి శారదాకాలనీ వరకు బీటీ రోడ్డు నిర్మించాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే శాఖ వారితో చర్చించి మొండి వాగు కల్వర్టు విస్తరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ డ్రైనేజీ పాత పైపులైను మార్పులు చేసి కొత్త పైపు లైన్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకురాలు నూరి ఫాతిమా పాల్గొన్నారు.

జగనన్న మహిళా మార్ట్‌లు ఏర్పాటుకు చర్యలు

మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి

నెహ్రూ నగర్: జగనన్న మహిళా మార్ట్‌లు రాష్ట్రంలో ఉన్న అన్ని మున్సిపాలిటీలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని మెప్మా మిషన్ డైరెక్టర్ వి.విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని శంకరన్ హాలులో రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల సీఎంఎంలు, టీఈలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రంలోని ఆరు మున్సిపాలిటీలో జగనన్న మహిళా మార్ట్‌లు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత తీసుకెళ్లి వారికి లబ్ధి చేకూర్చాలని ఆదేశించారు. అనంతరం యూనిసెఫ్ సంస్థ వారు నిర్వహించిన హ్యాండ్ వాష్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. హ్యాండ్ వాష్ కార్యక్రమం అన్ని మున్సిపాలిటీలో నిర్వహిస్తున్నామని, త్వరలో మార్కెట్ సెంటర్లలో కూడా హ్యాండ్ వాష్ కేంద్రలు ఏర్పాటు చేసి తగు రక్షణ చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరు హ్యాండ్ వాష్ చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు మెప్మా పీడీ పీ వెంకటనారాయణ, స్టేట్ మిషన్ కోఆర్డినేటర్ రమేష్, స్టేట్ కోఆర్డినేటర్ చక్రపాణి, స్టేట్ మిషన్ మేనేజర్ రంగాచారి, శ్రీనివాసరావు, 26 జిల్లాల సీఎంఎంలు, టీఈలు, యూనిసెఫ్ సంస్థ నుంచి ఆరోగ్య రాజు పాల్గొన్నారు.

గర్భ సమయంలో షుగర్‌తో అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ బూసిరెడ్డి దీప్తి రెడ్డి



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ బూసిరెడ్డి దీప్తి రెడ్డి

గుంటూరు మెడికల్ : గర్భం దాల్చిన తర్వాత కొంతమందికి షుగర్ సంక్రమించే అవకాశం ఉంటుందని దీన్ని నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రసూతి, గర్భ కోశ వ్యాధుల నిపుణురాలు డాక్టర్ బూసిరెడ్డి దీప్తిరెడ్డి అన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత షుగర్ పోతుంది కదా అని గర్భ సమయంలో అలక్ష్యం చేయకూడదని దీనివల్ల దుష్పరిణామాలు కలిగి తల్లి బిడ్డకు నష్టం చేకూరుతుందని చెప్పారు. ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలెంలో ఉన్నతి ఫౌండేషన్, సాయి భాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలో పలువురు గర్భిణులు, బాలింతలు, మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దీప్తిరెడ్డి మాట్లాడుతూ గర్భిణులు 13 వారాల్లోపు అన్ని రకాలైన వైద్య పరీక్షలు తప్పనిసరిగాచేయించుకోవాలని సూచించారు. ఎన్టీ స్కాన్, డబుల్ మార్కర్ టెస్ట్, క్రోమోజోన్ ఎనాలసిస్ టెస్ట్, రక్తహీనత, షుగర్ టెస్ట్ లు చేయించుకోవాలన్నారు. 18 వారాలనుంచి ఐరన్ , ఫోలిక్ యాసిడ్, తీసుకోవాలని, మూడు, ఐదు నెలల్లో టీటీ ఇంజక్షన్లు చేయించాలని 20 నుంచి 22 వారాల్లోగా టిఫా స్కాన్ పరీక్ష చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కాసు పద్మావతి, స్థానిక నాయకులు కాసు రాజశేఖర్ రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు

గుంటూరు రూరల్: ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమి ఆరోగ్యాన్ని కాపాడుతూ ఆరోగ్యకరమైన పంటలను పండించి ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రెస్ అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక శిక్షణా తరగతులు, ప్రత్యేక కథనాలతో రైతులకు సేవలందిస్తున్న రైతునేస్తం వ్యవసాయ పత్రికా సంపాదకులు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ పద్మశ్రీ యడ్లమూరి వెంకటేశ్వరరావు సేవలను ఆయన కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ సెక్రటరీ మామిడిపల్లి బాల గంగాధర్ తిలక్ మాట్లాడుతూ రసాయనిక వ్యవసాయంతో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని దానికి పరిష్కారంగా రైతులు సేంద్రియ వ్యవసాయ బాట పడుతున్నారన్నారు. రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన మన దేశీయ గోజాతులు, ఒంగోలు, గిర్, పుంగనూరు, కాంగ్రెజ్ ఆవు జాతుల వ్యర్థాలతో తయారు చేసిన వివిధ రకాల కషాయాలు, ద్రావణాలు ఉపయోగించి పంటలు పండించడం ప్రత్యక్షంగా చూపించటం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతులు, సేంద్రియ రైతులు రైతునేస్తం సిబ్బంది తదితరులున్నారు.

మహారాజశ్రీ మంగళగిరి ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

బిట్వీన్ O.S. 204/2022

దాసరి ప్రతాప్ - వాది

రిప్రజెంటెడ్ బై GPA ఏజెంట్ ఎమినేని అమ్మయ్య

ఎదిరి

శ్రీమతి షైనీ కరుణ - ప్రతివాది

టు

శ్రీమతి షైనీ కరుణ W/o పెళ్లి కరుణాకరరావు, R/o D.No. 26-16-176 ఆకులవారితోట, 2వ లేన్, గుంటూరు

పై నెంబరు దావాను వాది దావా షెడ్యూల్ ఆస్తి విషయమై ఇంజంక్షన్ ఇప్పించవలసి దావా దాఖలు చేయగా శ్రీకోర్టు వారు మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను మీరు తీసుకోనందున ఈ ప్రకటన ద్వారా మీకు సమన్లు మరియు నోటీసు జారీ చేసియున్నారు. కావున మీరు ది.06.02.2023 తేదిన పై తెలిపిన కోర్టులో హాజరై మీకు గల అభ్యంతరములను తెలుపుకోవలసినది. లేనియెడల పై నెంబర్ దావాను మరియు పిటీషన్లు మీ పరోక్షములో విచారించి తీర్మానించబడునని. కావున తెలియజేయడమైనది. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు జారీ చేయడమైనది.)

వాయిదాతేది: 06-02-2023

మంగళగిరి, ది.27.01.2023

దాసరి సురేష్ కుమార్, వాది తరుపు న్యాయవాది

హెడ్ పోస్ట్ ఆఫీస్ ఎదురు, మంగళగిరి-522503

అమరావతి, గుంటూరు జిల్లా, సెల్ 93482 33088

పెదకాకాని శివాలయంలో బహిరంగ వేలం

గణనీయంగా పెరిగిన స్వామివారి ఆదాయం



శివాలయంలో వేలంపాటలు నిర్వహిస్తున్న ఏసీ

పెదకాకాని: శివాలయంలో జరిగిన వేలంపాటల ద్వారా స్వామివారి ఆదాయం గణనీయంగా పెరిగినట్లు ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి దేవస్థానంలో మంగళవారం 2023–24 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి 21 అంశాలకు సంబంధించి ఈ ప్రొక్యూర్‌మెంట్ కమ్ సీల్డ్ టెండర్, బహిరంగ వేలంపాటలు నిర్వహించారు. గత ఏడాది జరిగిన వేలంపాటల కన్నా ఈ ఏడాది నిర్వహించిన వేలంపాటల ద్వారా స్వామివారికి 38,41,691 రూపాయలు అదనంగా ఆదాయం పెరిగింది. ఈ వేలంపాటలకు దేవదాయశాఖ పర్యవేక్షణాధికారిగా ఏసీ కోట వీరాంజనేయులు వచ్చారు. కొబ్బరికాయల షాపు, గ్యాస్‌స్టౌలు, టెంట్‌హౌస్, పార్కింగ్, ఫొటోలు, కొబ్బరి చెక్కల సేకరణ, వాహనాలకు బొట్లు, కూల్‌డ్రింక్ షాపు, విద్యుత్ దీపాలంకరణ తదితర అంశాలకు వేలంపాటలు జరగ్గా తలనీలాలు ప్రోగుచేసుకొను హక్కు, కళ్యాణమండపము పూల అలంకరణ, క్యాంటీన్, గోపంచకము విక్రయం వంటి పాటలు వాయిదా పడినట్లు ఏసీ తెలిపారు.

నేడు విధుల్లో చేరనున్న జీజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆశాసజని బుధవారం విధుల్లో చేరనున్నారు. కర్నూలులో పనిచేస్తున్న ఆమెను మ్యూచువల్ గ్రౌండ్స్‌లో గుంటూరుకు బదిలీ చేశారు. కర్నూలులో మంగళవారం రిలీవ్ అయి బుధవారం గుంటూరులో విధుల్లో చేరనున్నారు.

యువతి అదృశంపై కేసు నమోదు

పట్నంబజారు: ఇంటర్మీడియట్ విద్యార్థిని కనపడకుండా పోవడంపై కేసు నమోదు అయింది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్యామల నగర్ కు చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న యువతి ఈనెల 30వ తేదీ రాత్రి తల్లిదండ్రులతో కలిసి నిద్రకు ఉపక్రమించింది. అయితే తెల్లవారుజామున తల్లిదండ్రులు లేచి చూసేసరికి విద్యార్థిని కనపడకపోవడంతో, బంధువులు స్నేహితుల నివాసాలు అడిగినప్పటికీ ఎటువంటి ఫలితం కనపడలేదు. దీంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.